
కొయ్య కాలు బేట్స్

లిన్ బరాశ్




ఇరవయ్యవ శతాబ్దంలో ట్యాప్ డ్యాన్స్ బాగా చెయ్యగలిగిన వాళ్లల్లో క్లేటన్ "పెగ్-లెగ్" బేట్స్ ఒకడు. క్లేటన్‌కి చిన్నప్పటి నుంచి డ్యాన్స్ చెయ్యటం అంటే ఇష్టం. అయితే, అతడికి పన్నెండేళ్ల వయస్సులో ఒక కర్మాగారంలో జరిగిన ప్రమాదం వల్ల ఎడమ కాలు తీసెయ్యవలసి వచ్చింది. అతడు తిరిగి నడవగలుగుతాడని ఎవరూ అనుకోలేదు. కానీ, అతడు ముందు చంకల కర్రల తోటీ, తరవాత కొయ్య కాలు తోటీ డ్యాన్స్ చెయ్యటం మొదలుపెట్టాడు. త్వరలోనే మామూలు కాలుకి సమానంగా కొయ్య కాలుతో అతడు డ్యాన్స్ చెయ్యసాగాడు.

కొయ్య కాలు బేట్స్ అమెరికా, యూరపు అంతటా ప్రదర్శనలు ఇచ్చాడు. డ్యాన్స్‌లో తన ప్రత్యేక శైలితో అతడు ప్రేక్షకుల అభిమానాన్ని పొందాడు. అతడు అద్భుత ప్రదర్శకుడు. అంతే కాదు, ఎంతోమందికి స్ఫూర్తి దాయకంగా నిలిచాడు. జీవితం పట్ల అనంతమైన ప్రేమతో, ధృఢ నిశ్చయంతో అతడు తన దురదృష్టాన్ని అదృష్టంగా మలుచుకున్నాడు. ఒక అసాధారణమైన ఉదాహరణని మన ముందు ఉంచిన అతడు చిరకాలం గుర్తుండిపోతాడు.




1912లో దక్షిణ కరొలినాలో క్లేటన్ బేట్స్‌కి అయిదు సంవత్సరాలే. కానీ, అవకాశం దొరకినప్పుడల్లా డ్యాన్స్ చేసేవాడు. అందుకు తగిన బూట్లు లేకపోవటంతో అతడు ఏమీ లేకుండానే డ్యాన్స్ చేసేవాడు. సంగీత వాయిద్యాలు లేకపోవటంతో చప్పట్లు కొడుతూ, కాళ్లతో నేల మీద తాటుతూ సంగీతాన్ని సృష్టించేవాడు.



క్లేటన్ వాళ్ల అమ్మ ఒక కౌలు రైతు, ఒక తెల్ల దొర చేనులో పత్తి సాగు చేసేది. అందుకు ఫలితంగా ఆమెకు చాలా తక్కువ దక్కేది. కానీ, తెల్ల దొరలు ఇచ్చింది ఏదో తీసుకుని కష్టపడటం తప్పించి మరో మార్గం లేదు. ఆ రోజుల్లో దక్షిణ అమెరికా ప్రాంతంలో ఇలాంటి పరిస్థితి సర్వసాధారణం.


చేనులో పని తప్పించుకోటానికి క్లేటన్ పట్టణం లోని పత్తి కర్మాగారానికి వెళ్లేవాడు. పట్టణంలో అతడి డ్యాన్స్ చూసే ప్రేక్షకులు కొంతమంది దొరికేవారు.



జుత్తు కత్తిరించే శాలలో తెల్ల వాళ్ల కోసం క్లేటన్ డ్యాన్స్ చేసేవాడు. అది నచ్చిన వాళ్లు అతడి వైపు నాణాలు విసిరేవారు. క్లేటన్‌ని వెతుక్కుంటూ వచ్చిన వాళ్ల అమ్మకి ఇది చూసి చాలా కోపం వచ్చేది. “నా పిల్లవాడిని కోతిని చేసి ఆడించటం ఎంతమాత్రం సహించను!" అంటూ అతడిని లాక్కుని వెళ్లిపోయేది.

కానీ క్లేటన్ డ్యాన్స్ చెయ్యకుండా ఏదీ ఆపలేక పోయింది. అన్నింటికంటే డ్యాన్స్ చెయ్యటం అతడికి ఇష్టం. అందుకు అతడు ఏమైనా చేసేవాడు.





క్లేటన్‌కి పన్నెండేళ్లు వచ్చినప్పుడు పొలం పని నుంచి తప్పించుకోటానికి స్థానిక పత్తి మిల్లులో పని చెయ్యవచ్చా అని వాళ్ల అమ్మని అడిగాడు. అమ్మకి అది ఇష్టం లేదు. మిల్లు పనికి అతడు చాలా చిన్నవాడని ఆమె అభిప్రాయం.


వారాల పాటు బతిమాలిన తరవాత, "ఏం చెయ్యాలో దేవుడిని అడిగి ఏ విషయమూ రేపు చెబుతాను," అని వాళ్ల అమ్మ అంది.

మరునాడు ఆమె "సరే," అంది. అలా చెప్పటానికి దేవుడి కోరికో, క్లేటన్ పట్టుదలో ఆమెకి తెలియలేదు.

మిల్లులో క్లేటన్ పని మొదలుపెట్టిన మూడవ రోజే పెద్ద ప్రమాదం జరిగింది. అతడి ఎడమ కాలు ఒక యంత్రంలో చిక్కుకుపోయింది. కాలుని తీసెయ్యవలసి వచ్చింది, కానీ ఆ పని ఆసుపత్రిలో జరగలేదు. 1919లో దక్షిణ అమెరికాలో పేద, నల్ల జాతి బాలుడికి అలాంటి అవకాశమే లేదు. ఇంట్లో వంటింటి బల్ల మీద నాటు వైద్యులు ఆ పని చేశారు.

క్లేటన్ మళ్లీ నడుస్తాడని ఎవరూ అనుకోలేదు.





“దేవుడి మాట సరిగా వినలేదేమో!“ అంటూ అమ్మ ఏడ్చింది.



అమ్మ సరిగా విన్నదో, లేదో కానీ క్లేటన్ జీవితం మాత్రం మళ్లీ మామూలుగా ఉండదు. అతడు తీవ్ర నిస్పృహకి గురయిన క్షణాలు ఉన్నాయి. కానీ అతడి ఆత్మబలం కారణంగా పట్టు వదిలి పెట్టలేదు. అతడు యవ్వనంలో ఉన్నాడు, జీవశక్తితో ఉన్నాడు. అతడి మనసులోని సంగీతం బయటకు రావటానికి తహతహలాడుతోంది.



వెదురుతో చేసిన చంక కర్రలతో త్వరలోనే క్లేటన్ నడవసాగాడు.



అంతేకాదు, చంక కర్రలతో లయబద్ధ సంగీతం సృష్టించసాగాడు. అతడికి డ్యాన్స్ చెయ్యటం అంటే ఇష్టం, అంతే! వాళ్ల బాబాయ్ అతడి కోసం ఒక కొయ్య కాలు తయారు చేశాడు. దానికి చివరలో జారకుండా ఉండటానికి సగం రబ్బరు, శబ్దం చెయ్యటానికి సగం తోలు ఉన్నాయి. క్లేటన్ తన కుడి కాలుకి "టాప్" డ్యాన్స్‌కి కావలసిన ప్రత్యేక బూటు వేసుకున్నాడు. వాటితో క్లేటన్ అద్భుతమైన ధ్వనులను సృష్టించేవాడు. మెల్ల మెల్లగా "కొయ్య కాలు బేట్స్"గా పేరు పొందసాగాడు

క్లేటన్‌ని చూసిన వాళ్ల అమ్మ అతడి భవిష్యత్తు డ్యాన్స్‌లోనే ఉందని, అతడిని ఎవరూ ఆపలేరని అనుకుంది. అంతా అతడి మంచికేనేమో అని అనుకుంది.





డ్యాన్స్‌లో అన్ని స్టెప్స్ క్లేటన్
వెయ్యగలుగుతున్నాడు.



వాటిని నేర్చుకున్న తరవాత...




...క్లేటన్ సొంతంగా కొన్ని స్టెప్స్ నేర్చుకున్నాడు.




అతడి లాగా రిథం ట్యాప్ చేసేవాళ్లని ఎవరూ చూడలేదు.


నల్ల జాతీయుల కోసం డ్యాన్స్ చెయ్యటంతో క్లేటన్ తన వృత్తి జీవితాన్ని మొదలుపెట్టాడు. అతడు తన వేషధారణ గురించి ఎంతో జాగ్రత్త తీసుకునేవాడు. ప్రతి సూట్‌కి తగినట్టు ఉండే కొయ్య కాలు వేసుకునేవాడు.

క్లేటన్ సొంతంగా సృష్టించిన “అమెరికన్ జెట్ ప్లేన్” స్టెప్‌తో తన ప్రదర్శనను ముగించేవాడు. ఇందులో అతడు గాలిలోకి అయిదు అడుగుల ఎగిరి కొయ్య కాలు మీద నేలకి దిగి, రెండవ కాలుని వెనక్కి నిటారుగా ఉంచేవాడు. దీనికి ప్రేక్షకులు కరతాళ ద్వనులతో హోరెత్తించేవారు.






అనేక సంగీత కార్యక్రమాలలో ఇతర నల్ల జాతీయుల తోపాటు పాల్గొంటూ అతడు అమెరికా అంతా తిరిగాడు.




క్రమేపీ క్లేటన్ ప్రదర్శనలను చూడటానికి ప్రేక్షకులు పోటెత్తసాగారు. కేవలం శ్వేత జాతీయులు ప్రదర్శనలు ఇచ్చే థియేటర్లు అతడు కావాలని అడగసాగాయి. దాంతో తెల్ల కళాకారుల ముఖాలు నల్లగా అయిపోయేవి. మిగిలిన వాళ్ల లాగా మేకప్ వేసుకున్నందువల్ల క్లేటన్ నల్ల జాతీయుడని ఎవరికీ తెలిసేది కాదు.

కానీ, ప్రదర్శన ముగిసిన తరవాత క్లేటన్‌ని మిగిలిన వాళ్లతో భోజనానికి అనుమతించే వాళ్లు కాదు. నల్ల జాతీయుల కోసం ఉండే భోజనశాలకు వెళ్లి అతను తినేవాడు. డ్యాన్స్ చెయ్యటం కోసం క్లేటన్ ఈ వివక్షలను అన్నింటినీ భరించేవాడు.







కొంత కాలానికి కొయ్య కాలు బేట్స్‌కి చాలా ప్రజాదరణ, గుర్తింపు లభించాయి. ఇప్పుడు అతడు తన వేషాన్ని మార్చుకోవలసిన అవసరం లేకపోయింది. అతడు న్యూ యార్క్‌లోని హార్లెం లోని కాటన్ క్లబ్‌లో, ఎడ్ సల్లివాన్ టీవీ షో లోనూ, సినిమాలలోనూ ప్రదర్శనలు ఇచ్చి పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు.



ఇంగ్లాండు రాజు, రాణి ముందు కూడా క్లేటన్ ప్రదర్శన ఇచ్చాడు.





ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలిచ్చిన క్లేటన్‌కి అందరి తోపాటు భోజనం చేయటానికి, ఉండటానికి అనుమతి లభించేది కాదు. ఈ వివక్షతకి విసుగెత్తిన అతను నల్ల జాతీయులను ఆదరించే హోటలును సొంతంగా తెరవాలనుకున్నాడు. 1951లో అతడు న్యూయార్క్‌లోని క్యాట్‌స్కిల్ మౌంటెన్స్‌లో “పెగ్-లెగ్ బేట్స్ కంట్రీ క్లబ్” తెరిచాడు. 35 ఏళ్లకు పైగా అతడు అక్కడ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులకు ఆనందాన్ని పంచాడు.

అత్యంత ప్రతికూల పరిస్థితులను సైతం అధిగమించి కొయ్య కాలు బేట్స్ తన కలలను నిజం చేసుకున్నాడు.



"నల్ల వాళ్లైనా, తెల్ల వాళ్లైనా, ఒక కాలు ఉన్నా, రెండు కాళ్లు ఉన్నా మంచి ప్రదర్శన మంచి ప్రదర్శనే."

"రెండు కాళ్లూ ఉన్న ట్యాపర్స్‌కి సమానంగా లేదా వాళ్లకంటే మెరుగ్గా నేను ప్రదర్శనలు ఇచ్చాను. ఎంతో మంది ప్రయత్నించారు కానీ ఎవరూ నన్ను అందుకో లేకపోయారు."

"నన్ను జాలితో చూడవద్దు. నేను ఇలా బాగున్నాను. కొయ్య కాలుని తాటించటం నాకు బాగుంటుంది. నా ప్రదర్శనలలో జిమ్నాస్టిక్స్, అద్భుత విన్యాసాలు కలగలిపి ఉంటాయి. ఒంటి కాలుతో డ్యాన్స్ చేసే పెగ్-లెగ్ బేట్స్‌ని!"



క్లేటన్ "కొయ్య కాలు" బేట్స్, 1907-1998

(Clayton "Peg-leg" Bates)

అయిపోయింది